thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 145| జగిత్యాల | శుక్రవారం 28 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

## ఖేలో ఇండియా సంవాద్



- దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

.. వివరాలు 4లో

## వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

### భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు




అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్లు అమెరికా తాజాగా ప్రకటించింది.

4

## నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

- చైనా డ్యామ్‌తో ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు!



4



# మీరాలం ట్యాంక్‌కు టూరిజం టచ్

### అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి

- సస్పెన్షన్ బ్రిడ్జి పనులను క్రేన్‌పైకి వెళ్లి పరిశీలించిన సీఎం
- చెరువు మధ్యలోని ఐలాండ్లకు సరికొత్త రూపు
- జలక్రీడలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- మురుగునీటికి అడ్డుకట్ట.. మూసీలోకి వరద నీటికి ప్రత్యేక మార్గం

హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువును అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు, వినోదాన్ని ఆస్వాదించేలా చెరువును సుందరీకరించే పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు, శరవేగంగా సాగుతున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

- చురకలు, హైదరాబాద్, ఆగస్టు 27

2

## నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు

### విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య

### సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్

4



## మేమంతా క్షేమంగా ఉన్నాం



- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి
- నేపాల్-టిబెట్ ఆకస్మిక వరదల నుంచి తృటిలో తప్పించుకున్న 31 మంది హైదరాబాద్ యాత్రికులు
- సొగా ప్రాంతంలో సురక్షితంగా డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి దంపతులు
- చైనా మార్గం ద్వారా భారత్‌కు తిరుగుపయనం

2



## గవర్నర్‌కు సీఎం పరామర్శ

- ఆస్పత్రికి వెళ్లి శివ ప్రతాప్ ఆరోగ్యంపై ఆరా
- అందుతున్న వైద్య చికిత్స వివరాలు తెలుసుకున్న సీఎం
- సీఎం వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి

2

## తుమ్మిడిహట్టిపై ఢిల్లీలో కీలక భేటీ

- సెప్టెంబర్ 1న తెలంగాణ-మహారాష్ట్ర అధికారులతో సమావేశం
- కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన అంతర్రాష్ట్ర అంశాలపై చర్చ
- 152 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర ఆమోదం సాధించడమే తెలంగాణ లక్ష్యం

2





## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

- కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం

3

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది.

## రైస్‌మిల్లర్లపై బుల్‌డోజర్లు

- వనపర్తిలో రైస్‌మిల్లర్లపై అధికారుల ఉక్కుపాదం
- రూ. 52 కోట్ల బకాయిల ఎగవేతపై అధికారుల కఠిన చర్యలు
- రూ. 39 కోట్లు బకాయి పడ్డ చాముండి, రూ. 13 కోట్లు ఎగవేసిన సాంబశివ రైస్ మిల్లులు నేలమట్టం
- సివిల్ సప్లైస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కూల్చివేతలు

2



ప్రభుత్వానికి కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా మొండికేసిన రైస్‌మిల్లర్లపై వనపర్తి జిల్లా యంత్రాంగం కొరడా ఝుళిపించింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన చాముండి రైస్‌మిల్, సాంబశివ రైస్‌మిల్లులపై బుల్‌డోజర్లు ప్రయోగించింది.

## సురేఖ వ్యవహారం.. అధిష్ఠానం కోర్టులో!

- క్రమశిక్షణ కమిటీ నివేదిక ఏఐసీసీకి పంపించాం
- అధిష్ఠానం నిర్ణయం అందరికీ శిరోధార్యమే
- పార్టీలో స్వేచ్ఛ ఉంది.. కానీ క్రమశిక్షణకు లోబడే
- వ్యక్తిగత కోపాలు, కక్షలకు కాంగ్రెస్‌లో తావులేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టీకరణ

2



## ఆటో డ్రైవర్లకు 'ఈవీ' భరోసా

- 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ పథకం-2026'కు శ్రీకారం
- పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్పు
- ఇంధన, నిర్వహణ భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

2

## ఉత్తమ అధికారిపై ఏసీబీ దాడులు!



- మైనింగ్ ఏడీ జయరాజు ఆస్తులపై ఏకకాలంలో సోదాలు
- హైదరాబాద్ సహా ఎనిమిది ప్రాంతాల్లో తనిఖీలు
- 40 తులాల బంగారం.. బ్యాంకులో రూ.60 లక్షల నగదు గుర్తింపు
- బోడుప్పల్‌లో భవనం.. జనగామలో ఐదెకరాల వ్యవసాయ భూమి
- ఇసుక అక్రమ రవాణా ఆరోపణల కోణంలోనూ దర్యాప్తు

3



# గవర్నర్‌కు సీఎం పరామర్శ

**యశోదా ఆస్పత్రికి వెళ్లి శివ ప్రతాప్ శుక్లా ఆరోగ్యంపై ఆరా**

**అందుతున్న వైద్య చికిత్స వివరాలు తెలుసుకున్న సీఎం**

**హైదరాబాద్, ఆగస్టు 27:** అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స, ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు.

# మేమంతా క్షేమంగా ఉన్నాం

**డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి**

**నేపాల్-టిబెట్ ఆకస్మిక వరదల నుంచి తృటిలో తప్పించుకున్న 31 మంది హైదరాబాద్ యాత్రికులు**

**హైదరాబాద్, ఆగస్టు 27:** నేపాల్‌లో భారీ వరదలు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి తన క్షేమ సమాచారాన్ని వెల్లడించారు. "మేమంతా క్షేమంగా ఉన్నాం. వరదల్లో చిక్కుకోలేదు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేశారు. నేపాల్ పరిసర ప్రాంతాలను భారీ వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఈ విపత్తులో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించడంతో పాటు వందలాది మంది గల్లంతైనట్లు వార్తలు వస్తున్నాయి. గల్లంతైన వారిలో విదేశీయులతో పాటు భారతీయులు కూడా ఉన్నారన్న సమాచారంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. భారతీయుల ఆచూకీ కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సతీష్ రెడ్డి స్పందిస్తూ తమ బృందం సురక్షితంగా ఉందని తెలిపారు. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని, వరదల్లో చిక్కుకున్నామంటూ వస్తున్న ఆందోళన అవసరం లేదని చెప్పారు. తమతో ఉన్న వారంతా క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేసిన సతీష్ రెడ్డి, ఆగస్టు 30న హైదరాబాద్‌కు చేరుకుంటామని వెల్లడించారు. దీంతో ఆయన క్షేమంపై ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఊరట లభించింది.

# రైస్‌మిల్లర్లపై బుల్‌డోజర్లు

**వనపర్తిలో రైస్‌మిల్లర్లపై అధికారుల ఉక్కుపాదం**

**రూ. 52 కోట్ల బకాయిల ఎగవేతపై అధికారుల కఠిన చర్యలు**

**రూ. 39 కోట్లు బకాయి పడ్డ చాముండి, రూ. 13 కోట్లు ఎగవేసిన సాంబశివ రైస్ మిల్లులు నేలమట్టం**

**సివిల్ సప్లైస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కూల్చివేతలు**

**వనపర్తి, ఆగస్టు 27:** ప్రభుత్వానికి కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా మొండికేసిన రైస్‌మిల్లర్లపై వనపర్తి జిల్లా యంత్రాంగం కొరడా ఝుళిపించింది. నిబంధనలకు విరుద్ధంగా, అవసరమైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన చాముండి రైస్‌మిల్, సాంబశివ రైస్‌మిల్లులపై బుల్‌డోజర్లు ప్రయోగించింది. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి మిల్లు నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో పలుమార్లు ప్రయత్నించినప్పటికీ మిల్లుల యజమానుల నుంచి సరైన స్పందన రాలేదని అధికారులు పేర్కొన్నారు. విచారణలో సాంబశివ రైస్‌మిల్ రూ.13 కోట్లకు పైగా, చాముండి రైస్‌మిల్ రూ.39 కోట్ల మేర ప్రభుత్వానికి బకాయి ఉన్నట్లు గుర్తించారు. రెండు మిల్లులు కలిపి రూ.52 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు తేలడంతో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. బకాయిలు చెల్లించకపోవడంతో పాటు కనీస అనుమతులు లేకుండా మిల్లులను నిర్వహిస్తున్నట్లు తేలడంతో చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేశారు. రెవెన్యూ శాఖ సహకారంతో రెండు మిల్లుల నిర్మాణాలను బుల్‌డోజర్లతో కూల్చివేశారు. బకాయిల రికవరీ కోసం తదుపరి చర్యలు కొనసాగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ, పౌరసరఫరాల శాఖకు చెల్లించాల్సిన బకాయిలను ఎగవేస్తే ఉపేక్షించేది లేదన్న సంకేతాన్ని ఈ చర్యతో జిల్లా యంత్రాంగం ఇచ్చింది. కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును బకాయి పెట్టి తప్పించుకోవచ్చని భావించే మిల్లర్లపై ఇక కఠిన చర్యలు తప్పవన్న హెచ్చరికను బుల్‌డోజర్ చర్యల ద్వారా పంపింది.



# మీరాలం ట్యాంక్‌కు టూరిజం టచ్

- అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి
- సస్పెన్షన్ బ్రిడ్జి పనులను క్రేన్‌పైకి వెళ్లి పరిశీలించిన సీఎం
- చెరువు మధ్యలోని ఐలాండ్లకు సరికొత్త రూపు
- జలక్రీడలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశం
- మురుగునీటికి అడ్డుకట్ట.. మూసీలోకి వరద నీటికి మార్గం





**హైదరాబాద్, ఆగస్టు 27:** హైదరాబాద్‌లోని చారిత్రక మీరాలం ట్యాంక్‌ను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. చెరువు పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. ఒక్కో పనిని స్వయంగా పరిశీలించారు. అత్యుత్తమ డిజైన్లతో దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా మీరాలం ట్యాంక్‌ను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. చెరువు అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి పరిశీలించారు. అధికారులు ప్రాజెక్టు స్వరూపం, పనుల పురోగతిని వివరించారు. ప్రణాళికలను పరిశీలించిన రేవంత్ రెడ్డి పలు మార్పులు, సూచనలు చేస్తూ నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**క్రేన్‌పైకి వెళ్లి బ్రిడ్జి పనుల పరిశీలన**

మీరాలం ట్యాంక్ చుట్టూ చేపడుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఓపెన్‌టాప్ జీపులో ప్రయాణిస్తూ పరిశీలించారు. చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనులను మరింత దగ్గరగా పరిశీలించేందుకు భారీ క్రేన్ సహాయంతో పైకి వెళ్లారు. నిర్మాణ పనుల పురోగతి, డిజైన్, భద్రత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**మురుగునీరు చేరకుండా చర్యలు**

చెరువు పునరుజ్జీవనంలో నీటి నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు చెరువులోకి చేరకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదే సమయంలో వర్షాలు, వరదల సమయంలో చెరువులోని అదనపు నీరు సాఫీగా మూసీ నదిలోకి వెళ్లేలా నాలాను విస్తరించాలని సూచించారు.

**జలక్రీడలు.. ఐలాండ్లకు కొత్త అందాలు**

మీరాలం ట్యాంక్‌ను కేవలం సందర్శన ప్రాంతంగా కాకుండా పర్యాటకులు రోజంతా గడిపే వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. చెరువులో జలక్రీడలకు అనువైన ప్రత్యేక డిజైన్లు రూపొందించాలని ఆదేశించారు. చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందించేలా అభివృద్ధి చేయాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటం మీరాలం ట్యాంక్‌కు అదనపు ప్రయోజనమని, దీన్ని దృష్టిలో పెట్టుకుని చెరువుతో పాటు పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. పర్యాటకులను ఆకర్షించే ప్రత్యేక ప్రాజెక్టుగా దీనిని అభివృద్ధి చేయాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ఆకస్మిక తనిఖీ సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహట్టిపై ఢిల్లీలో కీలక భేటీ

- సెప్టెంబర్ 1న తెలంగాణ-మహారాష్ట్ర అధికారులతో సమావేశం
- కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన అంతర్రాష్ట్ర అంశాలపై చర్చ
- 152 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర ఆమోదం సాధించడమే తెలంగాణ లక్ష్యం
- గ్రావిటీతో నీటి తరలింపు.. విద్యుత్ భారాన్ని తగ్గించేలా ప్రణాళిక
- ప్రాజెక్టు సాకారం కోసం కేంద్రం, మహారాష్ట్రతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు

**హైదరాబాద్, ఆగస్టు 27:** ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంలో కీలక ముందడుగు పడనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుస ప్రయత్నాల నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారంపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కొంతకాలంగా మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ అంశాలకు పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం తదుపరి పరిశీలన కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రేవంత్ రెడ్డి మరో లేఖ రాసి తుమ్మిడిహట్టి విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 1న జరిగే సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

**152 మీటర్లే కీలకం**

తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు ప్రధానంగా చర్చకు రానుంది. గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి ఆ రాష్ట్రం నుంచి ఆమోదం సాధించాలని తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తరలించడం సాధ్యం కాదని తెలంగాణ వాదిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో భారీ పంపులను ఉపయోగించాల్సి రావడంతో విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతాయని ఇప్పటికే కేంద్రానికి వివరించింది. బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచితే తక్కువ విద్యుత్ వ్యయంతో దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందన్నది తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం అధ్యయనాల ప్రకారం జలమట్టాన్ని పెంచినా అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి వివరించింది. ఈ సాంకేతిక అంశాలను సెప్టెంబర్ 1 సమావేశంలో మరోసారి బలంగా వినిపించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



**ఢిల్లీ భేటీపైనే ఆశలు**

వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంలో తుమ్మిడిహట్టి కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాజెక్టును వీలైనంత త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్రం, మహారాష్ట్రతో సంప్రదింపులను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1న జరిగే ఢిల్లీ భేటీలో 152 మీటర్ల ఎత్తుపై మహారాష్ట్ర వైఖరి ఎలా ఉండబోతోంది? అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కేంద్ర జల సంఘం ఎలాంటి మార్గం చూపనుంది? అన్నది కీలకంగా మారింది. సమావేశంలో సానుకూల నిర్ణయం వెలువడితే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కార్యరూపం దాల్చే దిశగా కీలక అడుగు పడనుంది.

# ఆటో డ్రైవర్లకు 'ఈవీ' భరోసా

**'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ పథకం-2026'కు శ్రీకారం**

**పథకానికి రూ.200 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ**




**హైదరాబాద్, ఆగస్టు 27:** ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చుల భారాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ పథకం-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు ఇప్పటికే ముఖ్యమంత్రి ఆమోదం తెలపగా, తాజాగా ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను కేటాయిస్తూ జీవో జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఆటోల నిర్వహణ వ్యయం కూడా పెరుగుతుండటంతో డ్రైవర్ల ఆదాయంలో గణనీయమైన మొత్తం ఇంధనానికే వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం ద్వారా రోజువారీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించి డ్రైవర్లపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగడం వల్ల డ్రైవర్లకు ఆర్థిక ప్రయోజనం కలగడంతో పాటు వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రూ.200 కోట్లతో 18,766 ఆటోలను ఏ విధంగా ఎంపిక చేస్తారు, ఒక్కో ఆటో మార్పిడికి ఎంత మేర సాయం అందిస్తారు, లబ్ధిదారుల ఎంపికకు ఎలాంటి నిబంధనలు అమలు చేస్తారన్న అంశాలపై తదుపరి మార్గదర్శకాలు కీలకం కానున్నాయి.

# సురేఖ వ్యవహారం.. అధిష్ఠానం కోర్టులో!

**క్రమశిక్షణ కమిటీ నివేదిక ఏఐసీసీకి పంపించాం**

**అధిష్ఠానం నిర్ణయం అందరికీ శిరోధార్యమే**

**పార్టీలో స్వేచ్ఛ ఉంది.. కానీ క్రమశిక్షణకు లోబడే**

**వ్యక్తిగత కోపాలు, కక్షలకు కాంగ్రెస్‌లో తావులేదు**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టీకరణ**



**నిజామాబాద్, ఆగస్టు 27:** మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఇక ఏఐసీసీ పరిధిలోకి వెళ్లిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ అంశంపై క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదికను ఏఐసీసీకి పంపించామని, పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలు, కక్షలకు తావులేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఇటీవల కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి సురేఖకు పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదంటూ సురేఖ వివరణ ఇచ్చిన నేపథ్యంలో తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారంపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "కొండా సురేఖ అంశం ప్రస్తుతం ఏఐసీసీ పరిధిలో ఉంది. క్రమశిక్షణ కమిటీ నివేదికను అధిష్ఠానానికి పంపించాం. అక్కడ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేమంతా స్వాగతిస్తాం" అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు స్వేచ్ఛ ఉంటుందని, అయితే ఆ స్వేచ్ఛ పార్టీ క్రమశిక్షణకు లోబడే ఉండాలని స్పష్టం చేశారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే ఎక్కువ స్వేచ్ఛ ఉంటుందని పేర్కొన్నారు. ఎవరి మీదా వ్యక్తిగత కోపాలు, కక్షలతో నిర్ణయాలు తీసుకునే పరిస్థితి కాంగ్రెస్‌లో ఉండదన్నారు. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని కూడా వెల్లడించారు. ఇదే సందర్భంగా బీసీలకు కాంగ్రెస్ ఇచ్చినంత ప్రాధాన్యం మరే పార్టీ ఇవ్వలేదని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రానికి ఏ రూపంలోనూ అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. తనకు అందిన నోటీసుల అంశంపైనా స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్, సంబంధిత వివరాలను సమర్పిస్తానని తెలిపారు. కొండా సురేఖ వ్యవహారంపై ఇక ఏఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# ఉత్తమ అధికారిపై ఏసీబీ దాడులు!







- మైనింగ్ ఏడీ జయరాజు ఆస్తులపై ఏకకాలంలో సోదాలు
- హైదరాబాద్ సహా ఎనిమిది ప్రాంతాల్లో తనిఖీలు
- 40 తులాల బంగారం.. బ్యాంకులో రూ.60 లక్షల నగదు గుర్తింపు
- బోడుప్పల్‌లో భవనం.. జనగామలో ఐదెకరాల వ్యవసాయ భూమి
- ఇసుక అక్రమ రవాణా ఆరోపణల కోణంలోనూ దర్యాప్తు

**హైదరాబాద్, ఆగస్టు 27:** ఇటీవలే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇప్పుడు ఏసీబీ సోదాలతో వార్తల్లో నిలిచారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఆయన నివాసాలు, బంధువులు, సన్నిహితులకు సంబంధించిన ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లో మొత్తం ఎనిమిది చోట్ల సోదాలు కొనసాగాయి. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. సోదాల్లో జయరాజు నివాసంలో రూ.1.50 లక్షల నగదుతో పాటు సుమారు 40 తులాల బంగారు ఆభరణాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. బ్యాంకులో సుమారు రూ.60 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ భవనంతో పాటు భూములకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. జనగామలో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను కూడా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు మరిన్ని స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ జయరాజుకు సంబంధించిన ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోనే నాలుగు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయని, తాండూరు, వరంగల్‌లోని ఆయన బంధువులు, సన్నిహితుల నివాసాల్లోనూ సోదాలు చేపట్టినట్లు చెప్పారు. తనిఖీలు పూర్తయిన తర్వాత గుర్తించిన ఆస్తుల మొత్తం విలువపై స్పష్టత వస్తుందని వెల్లడించారు. జయరాజుపై గతంలో ఏసీబీకి పలు ఫిర్యాదులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొందరితో ఆయన కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో వినిపించాయి. ఈ వ్యవహారాల ద్వారా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారా అనే కోణంలోనూ ఏసీబీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఓవైపు ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న కొద్ది రోజులకే.. మరోవైపు ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ సోదాలు జరగడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

## హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు

**వరంగల్, ఆగస్ట్ 27:** బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.




# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27:** లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.







# నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

## కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు

## కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్ట్ 27:** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బోర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

# జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు నికేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్ట్ 27:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషిం చడంతో పాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# సినీ ఇండస్ట్రీలో విషాదం..

## సీనియర్ నటుడు, నిర్మాత జీవీ నారాయణరావు కన్నుమూత

**హైదరాబాద్, ఆగస్ట్ 27:** తెలుగు సినీ పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత జీవీ నారాయణరావు (73) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఆయన మరణ వార్తతో సినీ వర్గాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. పలువురు సినీ ప్రముఖులు, సహచర నటులు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తున్నారు. జీవీ నారాయణరావు కృష్ణా జిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి పెంచుకున్న ఆయన, సినిమా రంగంలో అడుగుపెట్టాలనే లక్ష్యంతో మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో నటనపై శిక్షణ తీసుకున్నారు. అనంతరం వెండితెరపై అడుగుపెట్టి తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. జీవీ నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, తెలుగు చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంది. దాదాపు పలు దశాబ్దాల పాటు నటుడిగా, నిర్మాతగా సినీ పరిశ్రమకు సేవలందించిన జీవీ నారాయణరావు ఇక లేరనే వార్త సినీ అభిమానులను కలచివేస్తోంది. ఆయన పోషించిన పాత్రలు, నిర్మించిన సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారు.





## సంపాదకీయం



# మంచుకొండల్లో మహా విలయం

## నేపాల్‌ను ముంచెత్తిన మెరుపు వరదలు

**ఊళ్లకు ఊళ్లే తుడిచిపెట్టుకుపోయిన భయానక దృశ్యం**

**హిమనీ సరస్సు బద్దలవడంతోనే జలప్రళయమని తాజా అంచనా**

**వందలాది మంది గల్లంతు.. విదేశీయుల ఆచూకీపైనా ఆందోళన**

**ముందస్తు సమాచారం ఇవ్వలేదంటూ చైనాపై నేపాల్ అసంతృప్తి**

**హిమాలయాల్లో ప్రకృతితో చెలగాటం మానకుంటే మరిన్ని ముప్పులే**

హిమాలయాల ఒడిలో ప్రకృతి మరోసారి తన ప్రచండ రూపాన్ని చూపింది. నిన్నటివరకు ఇళ్లు, మార్కెట్లు, రహదారులతో కళకళలాడిన ప్రాంతాలు ఇప్పుడు బురద, శిథిలాల దిబ్బలుగా మారాయి. కొన్ని చోట్ల అసలు అక్కడ గ్రామం ఉండేదా అన్న అనుమానం కలిగేంతగా వరద తన దారిలో ఎదురైన ప్రతిదానినీ తుడిచిపెట్టేసింది. నేపాల్‌లో సంభవించిన ఈ మహా జలవిలయం కేవలం ఆ దేశానికే కాదు.. హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతిని కాదని సాగుతున్న అభివృద్ధికి మరో ప్రమాద ఘంటికగా మారింది. భోటే కోషి, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చడంతో వాటి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. వరదతో పాటు కొండల నుంచి దూసుకొచ్చిన బురద, రాళ్లు జనావాసాలను కప్పేశాయి. రహదారులు తెగిపోవడం, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు కొన్ని ప్రాంతాలకు చేరుకోవడమే సవాలుగా మారింది. ఈ జలప్రళయానికి తొలుత టిబెట్ ప్రాంతంలో సంభవించిన భూకంపమే కారణమన్న ప్రచారం జరిగింది. అయితే అనంతరం వెలువడిన విశ్లేషణల్లో మంచు, కొండచరియల కదలికలే నమోదైన ప్రకంపనలకు కారణమై ఉండొచ్చన్న అభిప్రాయం తెరపైకి వచ్చింది. హిమనీ సరస్సు నుంచి భారీగా నీరు విడుదల కావడం, మంచు, రాళ్లతో కూడిన ప్రవాహం లిండే నది మీదుగా భోటే కోషిలోకి దూసుకురావడంతో వరద ఒక్కసారిగా మహోగ్రరూపం దాల్చినట్లు అంచనా వేస్తున్నారు. ఉపగ్రహ చిత్రాల్లోనూ పర్వత ప్రాంతాల నుంచి భారీ మంచు, రాళ్ల చరియలు కిందకు జారిన ఆనవాళ్లు కనిపించినట్లు నిపుణుల విశ్లేషణలు చెబుతున్నాయి. జలప్రళయానికి కొద్దిసేపటి ముందు నమోదైన ప్రకంపనలపైనా శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. అసలు ప్రకంపనల వల్ల కొండచరియలు విరిగాయా.. లేక భారీ కొండచరియల కదలికలే ప్రకంపనలుగా నమోదయ్యాయా అన్న అంశంపై పరిశీలన కొనసాగుతోంది. సహాయక చర్యల్లో భాగంగా తీసిన గగనతల దృశ్యాలు విధ్వంస తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇళ్ల కింది అంతస్తులు బురదలో కూరుకుపోగా, కొన్ని ప్రాంతాల్లో భవనాల ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. వరద ఉద్ధృతికి ప్రజలతో పాటు పర్యాటకులు కూడా చిక్కుకోవడంతో గల్లంతైన వారి పూర్తి సంఖ్యను నిర్ధారించడం కష్టంగా మారింది. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నా రహదారులు, వంతెనలు ధ్వంసం కావడం పెద్ద అడ్డంకిగా మారింది. పర్వత ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం కూడా సహాయక చర్యలకు సవాల్ విసురుతోంది. ఈ విపత్తులో ముందస్తు సమాచార వ్యవస్థపైనా తీవ్ర చర్చ మొదలైంది. టిబెట్ వైపు మెరుపు వరద సంభవించిన తర్వాత అది నేపాల్ సరిహద్దుకు చేరేందుకు కొంత సమయం ఉన్నప్పటికీ సరైన హెచ్చరిక అందలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల నుంచి సమాచారం అందే సమయానికి వరద ప్రవాహం నేపాల్ వైపు దూసుకొస్తుండటంతో అధికారులకు ప్రజలను అప్రమత్తం చేసేందుకు తగిన సమయం లేకుండా పోయిందని చెబుతున్నారు. చైనా నుంచి సమాచారం ఆలస్యంగా అందిందన్న విమర్శలు నేపాల్‌లో వ్యక్తమవుతున్నాయి. అయితే సరిహద్దులు దాటి ప్రవహించే నదుల్లో ఇటువంటి విపత్తులకు సంబంధించిన సమాచార మార్పిడిపై రెండు దేశాల మధ్య ఉన్న వ్యవస్థలు, ఒప్పందాల పరిధి కూడా ఇప్పుడు చర్చకు వస్తోంది. నేపాల్ జలవిలయం భారత్‌కూ హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉంది. హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులతో మంచు వేగంగా కరుగుతుండటం, హిమనీ సరస్సులు విస్తరించడం, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు భారీ నిర్మాణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ వంటి కార్యక్రమాల్లో పర్యావరణ సమతుల్యతను విస్మరిస్తే విపత్తుల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. సరిహద్దులు దాటి ప్రవహించే నదుల విషయంలో ముందస్తు సమాచార మార్పిడి అత్యంత కీలకం. ఎగువ ప్రాంతాల్లో అకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరిగితే దిగువనున్న దేశాలకు కొన్ని నిమిషాల ముందస్తు సమాచారం కూడా వేలాది ప్రాణాలను కాపాడగలదు. కొండలను తొలిచి నిర్మాణాలు.. నదుల సహజ ప్రవాహ మార్గాల్లో ఆక్రమణలు.. పర్యావరణ సామర్థ్యాన్ని పట్టించుకోకుండా అభివృద్ధి పేరుతో కట్టడాలు.. వాతావరణ మార్పుల ప్రభావం.. ఇవన్నీ కలిసినప్పుడు ప్రకృతి విపత్తు మహా విషాదంగా మారుతుంది. నేపాల్‌లో కనిపిస్తున్న దృశ్యాలు అందుకు మరో హెచ్చరిక. విపత్తు వచ్చిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం ఎంత ముఖ్యమో, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే వ్యవస్థలను బలోపేతం చేయడం అంతకంటే ముఖ్యం. హిమనీ సరస్సులపై నిరంతర నిఘా, ఉపగ్రహ పర్యవేక్షణ, సరిహద్దు దేశాల మధ్య తక్షణ సమాచార మార్పిడి, నదీ పరివాహక ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఇక తప్పనిసరి. నేపాల్‌ను ముంచెత్తిన ఈ జలప్రళయం ఒక దేశానికి ఎదురైన విషాదం మాత్రమే కాదు. ప్రకృతితో చెలగాటం ఆడితే పరిణామాలు ఎంత భయానకంగా ఉంటాయో హిమాలయాలు మరోసారి చేస్తున్న హెచ్చరిక.

# నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు

- **విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య**
- **సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్**




**ఖాట్మండ్, ఆగస్ట్ 27 :** నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది. నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాట్మాండూకు పంపింది.

# ఖేలో ఇండియా సంవాద్

## దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

**క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27:** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు య-ువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# భార్య బానిస కాదు

**భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు : కర్ణాటక హైకోర్టు**

బెంగళూరు, ఆగస్ట్ 27: వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.




# నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

**చైనా డ్యామ్‌తో ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు!**

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** నేపాల్‌లో సంభవించిన భయానక జలప్రళయం, సరిహద్దు దేశం నుంచి ముందస్తు సమాచారం అందక సంభవించిన పెను విధ్వంసం ఇప్పుడు భారతదేశానికి తీవ్ర హెచ్చరికగా మారింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్ర నదిపై (టిబెట్‌లో 'యార్లంగ్ జాంగ్బోగా) చేపడుతున్న అత్యంత భారీ జలవిద్యుత్ డ్యామ్ ప్రాజెక్టు వల్ల భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లకు భవిష్యత్తులో తీవ్ర ముప్పు పొంచి ఉందనడానికి నేపాల్ పరిణామాలే నిదర్శనమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ః గ్రేట్ బెండ్ః వంపు వద్ద చైనా సుమారు 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో 60,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ః మైడాగ్ డ్యామ్ఃను నిర్మిస్తోంది. ఇది చైనాలోని ప్రపంచ ప్రసిద్ధ ః త్రీగోర్జెస్ డ్యామ్ః కంటే మూడు రెట్లు పెద్దది. అయితే, ఈ నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగుభాగంలో ః పైజెన్ ఫాల్ట్ః అనే ప్రమాదకర భూగర్భ పగులు ఉందని చైనా జియోలాజికల్ సర్వే అధ్యయనమే ధృవీకరించింది. భూకంపాలు, కొండచరియలు తరచూ విరిగిపడే ఈ సున్నితమైన హిమాలయ ప్రాంతంలో ఇలాంటి నిర్మాణం చేపట్టడం వల్ల, భూకంపం సంభవించిన వేళ ఇది భారత్, బంగ్లాదేశ్‌లపై వినాశనం సృష్టించే 'వాటర్ బాంబ్‌లా మారే ప్రమాదముందని భూగర్భ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరు దేశాల మధ్య నదీజల వివాద పరిష్కారానికి లేదా అత్యవసర ముందస్తు సమాచార మార్పిడికి శాశ్వత ఒప్పందాలు లేకపోవడం భారత్‌ను వేధిస్తున్న అతిపెద్ద సమస్య. చైనా ఒకేసారి అపార జలరాశిని విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగిపోతాయని, లేదా వేసవిలో నీటిని ఆపేస్తే ఇక్కడ తాగు, సాగునీటికి తీవ్ర కొరత ఏర్పడుతుందని నిపుణులు చెప్తున్నారు. చైనా వైపు నుంచి ఎదురయ్యే ఈ జల ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ కూడా అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ నదిపై 11,000 మెగావాట్ల సామర్థ్యంతో ః సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ఃను నిర్మించి ఎగువ ప్రవాహాలను నిరోధించేందుకు సన్నాహాలు చేస్తోంది.

# వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు**

**వాషింగ్టన్, ఆగస్ట్ 27:** అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

# విరాహత్ అలీని పరామర్శించిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ బాధ్యులు



: **గజ్వేల్** : మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీని గురువారం ఉదయం గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ బాధ్యులు పరామర్శించి, బషారత్ ఉన్నిసా బేగం మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సిరిగిరి విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్, ఉపాధ్యక్షుడు ఎ. రాజేష్ లు విరాహత్ ను పరామర్శించి ఓదార్చారు.

# సర్ కార్యక్రమంపై బీఎల్ఓలు, బీఎల్ఏలకు అవగాహన



: **సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని యూపీఎస్ పాఠశాలలో గురువారం సర్ కార్యక్రమం ఫేజ్–2పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని సత్తుపల్లి మున్సిపాలిటీలోని 23 వార్డులకు చెందిన బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏలు)తో మాట్లాడారు. సర్ కార్యక్రమంలో ఎదురవుతున్న సమస్యలు, అందుతున్న ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బీఎల్ఓలు, బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతిఒక్కరి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమలపాషా, మున్సిపల్ కమిషనర్ నరసింహ, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ స్కాలర్షిప్ దరఖాస్తులు



: **కాగజ్నగర్:** కాగజ్ నగర్ పట్టణంలోని పలు డిగ్రీ కాలేజీలలో విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ స్కాలర్షిప్ కోసం దరఖాస్తులు చేయించారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ, తిరుమల, గీత, అంజలి పాల్గొని విద్యార్థినులకు స్కాలర్షిప్ దరఖాస్తు ప్రక్రియలో సహకరించారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవాలని కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి





**జిల్లా కలెక్టర్ కె.హరిత**

: **ఆసిఫాబాద్ టౌన్** : ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులు, బూట్లు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువులు రాణించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలకు గైర్హాజరు అవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఇంగ్లీష్ గణితం సైన్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పట్టు సాధించేలా ప్రయోగాత్మకంగా బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జి.సి.డి.ఓ. శకుంతల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

: **ఆసిఫాబాద్** :

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో గల ఖాళీ ప్రదేశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. జిల్లాకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, కాలువ గట్లు, చెరువు గట్లపై, రహదారికి ఇరువైపులా అవసరమైన మొక్కలను నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామలై మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో నివేదికలు సమర్పించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

: **ఆసిఫాబాద్:** జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దార్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో కూడిన నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. లావుని పట్టా, సీలింగ్, ప్రభుత్వ భూములు, అటవీ, దేవాదాయ, వక్ఫ్, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఆస్తులు, విచారణ సంస్థలు అటాచ్ చేసిన ఆస్తులను నిషేధిత జాబితాలోని కేటగిరీలలో చేర్చాలని తెలిపారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూములను జాబితాలో చేర్చాలని తెలిపారు. సాదా బైనమా, రెవెన్యూ సదస్సులు, భూ భారతిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు పాల్గొన్నారు.




# నూతన చేయూత పెన్షన్ దరఖాస్తు సమాచారం అందరికీ చేరాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

: **ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేయూత పెన్షన్లను మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, అధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ల కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు కావడంతో. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం సమాచారం చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా పెన్షన్కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శశిధర్, ఎ.పి.ఓ. (పెన్షన్) రామకృష్ణ, ఎ.పి.ఓ. ధన్‌రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై గ్రామ సభ

: **ఆసిఫాబాద్ రూరల్:** రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో ముసాయిదా ఓటరు జాబితా ప రిశీల న , ఆ బ్సెంట్ / షిఫ్టెడ్ / డెడ్ / డూప్లికేట్ ఓటర్ల వివరాలు, కొత్త ఓటర్ల నమోదు, సవరణలు అభ్యంతరాల స్వీకరణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ బీ పోచయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఓటరు జాబితాను తనిఖీ చేసుకుని, ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే సంబంధిత బి.ఎల్.ఓ ల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల ఫోరం జిల్లా కన్వీనర్ గులాం జావీద్, వార్డు సభ్యులు పోటుపల్లి లావణ్య, జాబరీ కిషోర్, బూరస భూపతి, తిరుశుల ననాయ్య, సిడం మీరా, డాక్టర్ కీర్తి, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, బిల్ కలెక్టర్ నాగేంద్ర, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది ఆర్.ఐ శ్రీనివాస్, జీపీఓ వామన్, బి.ఎల్.ఓలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యతతో ముందడుగు వేయండి

**• పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఎస్పీ పిలుపు**

: **ఆసిఫాబాద్:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బాధ్యులను జిల్లా ఎస్పీ నితికా పంత్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం అంకిత భావంతో పని చేయాలని ఎస్పీ సూచించారు. శాఖలో ఐక్యత, పరస్పర సహకారం సమన్వయాన్ని బలోపేతం చేస్తూ సానుకూల వాతావరణాన్ని పెంపొందించాలని కోరారు. అసోసియేషన్ చేపట్టే అన్ని సంక్షేమ కార్యక్రమాలకు జిల్లా పోలీసు యంత్రాంగం తరఫున పూర్తి సహకారం ఉంటుందని ఎస్పీ నితికా పంత్ హామీ ఇచ్చారు.




**నూతన కార్యవర్గం ఎన్నిక**

పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి అధ్యక్షులుగా బీ. శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఈ రమేష్, కె సందీప్ కుమార్, కార్యదర్శిగా ఎన్ వామనమూర్తి, సంయుక్త కార్యదర్శి గా బీ విజయ్ కుమార్ , ఆర్గనైజింగ్ కార్యదర్శి గా టీ లావణ్య, కోశాధికారిగా సిహెచ్ ప్రేమ్ సింగ్, కార్యవర్గ సభ్యులుగా పీ. రాజేందర్ , ఈ స్వప్న, ఆర్ సుజాత , కె అనూష, కె వినయ్, ప్రశాంత్ లు ఎన్నికయ్యారు.

# గొలుసు చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్




: **కౌటాల:** తలోడి గ్రామంలో వృద్ధురాలిపై దాడి చేసి బంగారు గొలుసు చోరీ చేసిన కేసులో ఇద్దరిని కౌటాల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈనెల 21న తెల్లవారుజామున 3 గంటల సమయంలో కొంపరి గౌరక్క ఇంటి కిటికీలోని ఇటుకలు తొలగించి లోనికి చొరబడిన నిందితుడు ఆమెపై దాడి చేసి అర తులం బంగారు గొలుసు అపహరించాడు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు బాధితురాలి మనుమడు కొంపరి రాముగా గుర్తించారు. అతడికి సహకరించిన బావ సంచికాల సతీష్ను కూడా అరెస్టు చేశారు. చోరీ చేసిన గొలుసును గోదావరిఖనిలోని మణప్పురం ఫైనాన్స్లో కుదవపెట్టి వచ్చిన నగదును ఇద్దరూ చెరిసగం పంచుకున్నట్లు తెలిపారు. నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు.

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**• భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేశ్వరరావు**



: **ఆసిఫాబాద్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి తన వద్దే విద్యాశాఖను ఉంచుకుని, ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో రాష్ట్రంలో ఇప్పటికే వందలాది కళాశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వేలాది మంది నిరుపేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే స్పందించి బకాయిలన్నింటినీ విడుదల చేయకపోతే, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్, భాజపా జిల్లా యూత్ అధ్యక్షుడు గాజుల రాజేంద్ర ప్రసాద్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, భాజపా నాయకులు ప్రసాద్ గౌడ్, మేకర్తి లచ్చన్న, సప్తే శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి.. ఒకరు మృత్యువాత

**కుటుంబాన్ని విషాదంలో ముంచిన ప్రమాదం**



: **కౌటాల:** చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నదిలో పడి మృత్యువాత పడటంతో తాటిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన కొస్రే రాందాస్(34) చేపల వేటకు వెళ్లి నదిలో పడి మృతి చెందాడు. బుధవారం సాయంత్రం సుమారు 5గంటల సమయంలో రాందాస్ నదిలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో జారిపడ్డాడు. ఈత కొట్టే ప్రయత్నం చేసినప్పటికీ నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చేపల వేటకు వెళ్లిన వ్యక్తి విగతజీవిగా ఇంటికి చేరడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

# మాధాపూర్ లో సిసి కెమెరాల వ్యవస్థ ప్రారంభం

**• సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా చొరవను అభినందించిన ఎస్పీ అఖిల్ మహాజన్**

: **ఇచ్చోడ:** మాధాపూర్ గ్రామ ప్రజల భద్రత, రక్షణే ధ్యేయంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాల వ్యవస్థను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో 24 గంటల నిఘా ఉంచడం ద్వారా నేరాల నివారణకు ఈ వ్యవస్థ ఎంతగానో దోహ[illegible] పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా ప్రత్యేక చొరవ తీసుకొని, గ్రామ రక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటును విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఎస్పీ సర్పంచ్ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు ఇలాంటి ముందడుగు వేయడం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ, సీఐలు గ్రామ భద్రతపై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా మాట్లాడుతూ మాధాపూర్ గ్రామ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# మున్నూరుకాపు సంఘ భవనంలో లైబ్రరీ ప్రారంభం

: **ఆదిలాబాద్:** పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడని, మంచి పుస్తకం మంచి భవిష్యత్తును అందిస్తుందని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష అన్నారు. పట్టణంలోని తాలూకా మున్నూరుకాపు సంఘ భవన ఆవరణలో యువత కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీని గురువారం ఆమె మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో జ్ఞానంతో పాటు మంచి వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. ఆర్థిక భారంతో ప్రత్యేక శిక్షణ పొందలేని పేద విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చదువు విలువ తెలిసి, విశ్రాంత ఉపాధ్యాయుడైన తాలూకా అధ్యక్షుడు శివన్న నేతృత్వంలో ఈ లైబ్రరీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తోట శివన్న, కార్యదర్శి సంతోష్, రఘుపతి, బండారి సతీష్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.




# నూతన ఎంపీడీఓకు ఘన సన్మానం



: **జైనూర్:** జైనూర్ మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణిని వికలాంగుల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో పాటు ఎంపీఓ శశికుమార్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని వికలాంగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా వికలాంగులకు మరింత ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి అధికారులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు మెస్రం నాగోరావ్, ఉపాధ్యక్షుడు జాదవ్ మోహన్, సంఘం నాయకులు తిరుపతి, మడవి దేవురావు, ఇసాఖ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

: **మంచిర్యాల:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను త్వరిత గతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం వంటశాల, భోజనశాలలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి విద్యాలయంలో అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# పాములవాడ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



: **జైనూర్**: రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిర్పూర్(యు) మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాముల వాడలో రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరస్పరం రాఖీలు కట్టి రక్షాబంధన్ పండుగ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రేమ, సోదరభావం, ఐక్యత వంటి విలువలు పెంపొందించాయని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విద్యార్థులు ఆనందో త్సాహాలతో రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు.

# ప్రభుత్వ దృష్టికి జర్నలిస్టుల గళం

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి



: **సత్తుపల్లి**: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలనే డిమాండ్తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం వేంసూర్కు చేరుకుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు వేంసూర్ చేరుకున్న పాదయాత్ర బృందానికి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కెంపు రాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేంసూర్ మండలానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయ సంఘాల ప్రతినిధులు పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యతో పాటు వారి ఇతర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిగణించి పరిష్క రించాలని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# అర్హులందరి పేర్లు నమోదయ్యేలా చర్యలు





: **జైనూర్**: ఓటరు జాబితాలో అర్హులందరి పేర్లు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. జైనూర్ మండలం పవర్గూడ గ్రామపం చాయతీ పరిధిలో ఓటరు జాబితా సవరణపై గురువారం బీఎల్ఏ, బీఎల్ఓలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ఓటర్ల వివరాలను పరిశీలించి, జాబితాలో పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేసే విధానంపై చర్చించారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్ల పేర్లను జాబితాలో నమోదు చేయడం, అర్హత కలిగిన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సూచనలు చేశారు. ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా సవరణలు అవసరమైతే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని కోరారు. జాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జాబితా సవరణలో ప్రజలు సహక రించాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, బీఎల్ఏలు, బీఎల్ఓలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

- మాదకద్రవ్య రహిత మంచిర్యాలే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



: **మంచిర్యాల**: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ఞతో కలిసి డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత మంచిర్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 49 డ్రగ్స్ కేసులు నమోదు కాగా, 103 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ వినియో గదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతినెలా అవగాహన కార్యక్రమాలు, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెడికల్, ఐటీఐ, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక నిఘా ఉంచి డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి తదితర మొక్కల సాగును గుర్తించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. మెడికల్ షాపులను నిరంతరం తనిఖీ చేసి సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ ఇన్స్పెక్టర్లకు సూచించారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివే యడంతో పాటు బెల్ట్ షాపులను నియం త్రించాలని తెలిపారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు..**

జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించిన కలెక్టర్ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రోడ్డు భద్రత సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై చెత్త, ఇతర ఆటంకాలను తొలగించాలని, అనధికార పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకో వాలని తెలిపారు. ఓవర్లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్సైడ్ డ్రైవింగ్పై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్ప టివరకు 95 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసినట్లు తెలిపారు. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై సంచరించే పశువులను గోశాలలకు తరలించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు



: **మంచిర్యాల**: జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికా రులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపం చాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన ఎస్ఐఆర్ గ్రామసభలకు హాజరై అధికారులతో కలిసి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబితాలో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో ప్రజలకు స్పష్టంగా చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికా రులను ఆదేశించారు. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ ఓటర్లకు సంబంధించి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియలోని ప్రతి దశను పారదర్శకంగా, నిష్ప క్షపాతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేలా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహశీల్దార్లు, బూత్ స్థాయి అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పాదయాత్రకు సత్తుపల్లిలో అపూర్వ స్పందన



: **సత్తుపల్లి**: జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం సత్తుపల్లి పట్టణానికి చేరుకుంది. ఆగస్టు 22న అమర జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ 78వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని ఆయన విగ్రహం వద్ద ప్రారంభమైన పాదయాత్రకు సత్తుపల్లిలో స్థానిక జర్నలిస్టులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం ఎంపీడీఓ కార్యాలయం నుంచి బోస్ బొమ్మ సెంటర్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నిని బాలు అధ్యక్షతన జరిగిన సభలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం రూ.5లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇలా నిధులు కేటాయిస్తున్న ఎమ్మెల్యే తానేనని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందుకోసం స్థలాన్ని కూడా పరిశీలించామని, ఈ విషయాన్ని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నియోజకవ ర్గంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు తమ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. వాస్తవాలను తెలుసుకొని వార్తలు రాయాలని జర్నలిస్టులకు సూచించారు. ప్రజా సంక్షేమం కోసం మట్టా కుటుంబం ఎల్లప్పుడూ పనిచేస్తుందని తెలిపారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం ద్వారా ఇండ్ల స్థలాల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే మోసపోవద్దని సూచించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులను సాధారణ పౌరులుగా గుర్తించి వారికి ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే రాగమయి గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని గుర్తించి ప్రత్యేకంగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన ఘనత ఎమ్మెల్యే రాగమయికే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ రాష్ట్ర ఐసీడీఎస్ శాఖ కమిటీ సభ్యురాలిగా ఎంపికైనందుకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీని వాసరెడ్డి, మధుబాల తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ పురపాలక సంఘం అధ్యక్షుడు కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ వార్డు కౌన్సిలర్ మల్లూరు అంకంరాజు తదితరులు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర బృందాన్ని శాలువాలతో సత్కరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వే శ్వరరావు, ఐద్వా నాయకురాళ్లు జాజిరి జ్యోతి, కుమారి, సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ నాయకుడు శరత్ మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు, ప్రభుత్వాలకు తెలియజేస్తూ జర్నలిస్టులు నాలుగో స్తంభంగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను వెలికితీసి పాలకులను స్పందింపజేసే జర్నలిస్టులే తమ హక్కుల కోసం పాదయాత్ర చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకర మన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, లేనిపక్షంలో వామపక్ష పార్టీలు ప్రత్యక్ష పోరాటానికి దిగుతాయని హెచ్చరించారు. స్థానిక జర్నలిస్టులు షయాబుద్దీన్, బి.వి. రామారావు తదితరులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహశీల్దార్ శ్రీనివాస్కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మధుకీర్తి, చీపీ గంగాధర్, సుధాకర్, మల్లూరు చంద్రశేఖర్, ఆరెంపుల హరిబాబు, అఫ్జల్, గోదా నాగబాబు, గుంట్రు సూర్య తదితరులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# చట్టం చుట్టమా? అధికారులే తొత్తులా?

## "నన్నెవడూ ఏమీ చేయలేడు!".. అధికారులకే బిల్డర్ బహిరంగ సవాల్!

- గ్రీన్ మెష్ ముసుగులో జీరో పర్మిషన్ తో ఆకాశాన్నంటుతున్న అక్రమ నిర్మాణం!
- హైకోర్టు ఆదేశాలన్నా లెక్కలేదు.. జీహెచ్ఎంసీ చట్టాలంటే గౌరవమే లేదు!
- సామాన్యుడిపై జేసీబీల ప్రతాపం.. బడా బిల్డర్ల ముందు 'టౌన్ ప్లానింగ్' సాగిలపాటు?
- కేపీహెచ్‌బీ రోడ్ నెం.1 (ప్లాట్ నెం. 194/MIG-I) లో నిస్సిగ్గుగా సాగుతున్న అక్రమ సామ్రాజ్యం
- ముడుపుల మత్తులో జోగుతున్న స్థానిక సర్కిల్ యంత్రాంగం.. కనీస చర్యలు శూన్యం!



**కూకట్‌పల్లి, :** "నాపై ఎన్ని ఫిర్యాదులు చేసినా సరే.. ఏ అధికారైనా నన్ను ఆపగలడా? నన్నెవరూ ఏమీ చేయలేరు!" అంటూ ఓ అక్రమ నిర్మాణదారుడు బహిరంగంగానే చట్టానికీ, అధికార యంత్రాంగానికీ సవాలు విసురుతున్న తీరు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనుమతులు రద్దయినా, న్యాయస్థానాలు మొట్టికాయలు వేసినా సదరు బిల్డర్ మాత్రం "అధికారులు నా జేబులో ఉన్నారు" అన్న ధీమాతో రెచ్చిపోతుండడం వ్యవస్థకే మాయని మచ్చగా మారుతోంది.

"నన్ను ఏ అధికారి ఏం చేయలేడు" అని బిల్డర్ గర్వంతో విసురుతున్న ఈ సవాలును జీహెచ్ ఎంసీ కమిషనర్, విజిలెన్స్ విభాగం, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్వీకరిస్తారా? లేక చట్టాన్ని తొక్కిపెడుతూ బిల్డర్ చేస్తున్న అక్రమానికి సలాం కొడతారా? అనేది

### ఉన్నతాధికారులైనా స్పందిస్తారా?

తేలాల్సి ఉంది. ఇప్పటికైనా నిబంధనలను ఉల్లంఘించి, కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్న ఈ అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేసి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### అనుమతి రద్దైనా.. ఆగని కాంక్రీట్ దందా!

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెం.1 (ప్లాట్ నెం. 194/MIG-I) వద్ద కనీస సెట్‌బ్యాక్‌లు లేకుండా, నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ సెల్లార్ ప్లస్ ఐదున్నర అంతస్తుల భారీ భవనాన్ని లేపేశారు. గతంలో ఇచ్చిన సెల్ఫ్ సర్టిఫికేషన్ నిర్మాణ అనుమతిని సైతం జీహెచ్ఎంసీ అధికారులు రద్దు చేశారు. నిబంధనల ప్రకారం వెంటనే ఆ భవనాన్ని కూల్చివేయడమో లేదా పనులను సీజ్ చేయడమో చేయాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీని చుట్టూ భారీ ఆకుపచ్చని (గ్రీన్ మెష్) నెట్‌ను కప్పి, కళ్లుగప్పి దర్జాగా ఫినిషింగ్ పనులు కానిచ్చేస్తున్నారు.

### హైకోర్టు ఆదేశాలంటే చిత్తుకాగితాలా?

బాధితులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్థానిక అధికారులు చేష్టలుడిగి చూడటంతో, వ్యవహారం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) మెట్లెక్కింది (రిట్ పిటిషన్ నెం. 17680/2026). కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అధికారులు మాత్రం ఆ ఆదేశాలను బుట్టదాఖలు చేస్తూ బిల్డర్‌కు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "కోర్టులైనా.. అధికారులైనా నా ముందు దిగదుడుపే" అన్న అహంకారంతో బిల్డర్ అడ్డూఅదుపు లేకుండా పనులు కొనసాగిస్తుంటే.. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనుక ఏ స్థాయి ముడుపుల మాయాజాలం దాగి ఉందో ప్రజలకే అర్థమవుతోంది.

### సామాన్యుడికొక న్యాయం.. బడా బాబులకొక న్యాయమా?

పేదవాడో, మధ్యతరగతి వ్యక్తో ఇంటికి చిన్న రేకుల షెడ్డు లేదా అదనపు గది వేసుకుంటే నిమిషాల్లో జేసీబీలు, కార్మికులతో వచ్చి కూల్చివేతలు చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు.. నడిరోడ్డుపై నిబంధనలను కాలరాస్తూ ఇంత పెద్ద భవనం లేస్తుంటే కళ్లుండి చూడలేని గుడ్డివారిలా ఎందుకు నటిస్తున్నారు? సెక్షన్ ఆఫీసర్ల నుంచి సర్కిల్ స్థాయి ఉన్నతాధికారుల వరకు అందరికీ ఈ అక్రమం కనపడకపోవడం వెనుక ఎంతటి కాసుల కక్కుర్తి ఉందో తేలాల్సి ఉంది.

# విద్య, వైద్య రంగాల బలోపేతానికే ప్రజా ప్రభుత్వం పెద్దపీట

### మంత్రి పొంగులేటి

**ఖమ్మం :** తిరుమలాయపాలెం, ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బలోపేతానికి రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో రూ. 30 లక్షల నిధులతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల నూతన భవనానికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం హరితహారంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. తదనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.గత బీఆర్ఎస్ పాలనలో విద్య, వైద్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో ఆ రెండు రంగాలకు గత ప్రభుత్వం కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించిందని తెలిపారు.

**స్కిల్ యూనివర్సిటీతో ఉద్యోగాలు**

యువతకు నైపుణ్యంతో కూడిన సాంకేతిక విద్యను అందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.



**మహిళలకు రూ. 63 వేల కోట్లు**


రాష్ట్రంలోని ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్పటివరకు రూ. 63 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు:ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ఇచ్చామని, పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో మూడో, నాలుగో విడత కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అర్హులైన వారందరూ ఈ నెల 31వ తేదీలోగా కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాలేరు నియోజకవర్గ, రాష్ట్ర ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఉద్యోగ విరమణ చేసిన ఎంఈఓ ఆనందరావు

**రామారెడ్డి, :** రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి ప్రధానుపాధ్యాయులుగా పని చేసి మండల విద్యాశాఖ అధికారిగా ఆనందరావు గురువారం రోజున ఉప్పల్వాయి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో ఉద్యోగ విరమణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు, ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని, అతను చేసిన సేవలు మరువలేనివని, ఒక ఉపాధ్యాయునిగా పనిచేసి మండల విద్యాశాఖ అధికారిగా తన పదవి విరమణ చేయడం చాలా గొప్పదనం అని అందరి కొనియాడారు, ఆనందరావు మాట్లాడుతూ ఈ పాఠశాల తరఫున, మండల శాఖ తరఫున మంచి పేరు వచ్చినందుకు ఉద్యోగ విరమణ పొందినందుకు ఒక రకంగా బాధగా ఉన్నప్పటికీ సంతోషంకరంగా ఉన్నదని అన్నారు, వృత్తి రీత్యా ఎన్నో ఒడిదుడుకులు వచ్చిన సామరస్యంగా ఎదుర్కోవడం నాలో ఉన్న మంచి లక్షణంగా భావిస్తాను అని అన్నారు, తన కుటుంబ సభ్యులు కూడా తనకు అన్ని రకాలుగా సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం, యువకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నాచేపల్లిలో నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం :** నేలకొండపల్లి, నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు.గ్రామంలో నూతనంగా వివాహం చేసుకున్న సుజాత - వెంకటేష్ దంపతులను మంత్రి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోగుల శేఖర్ రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ ముంద్రా నాగప్రసాద్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎం. వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గోగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# టీసీసీ మీడియా జిల్లా అధ్యక్షులు నారపోగు ప్రసాద్ కు ఘన సన్మానం



**ఖమ్మం :** తల్లాడ, తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఘనంగా సన్మానించారు.గురువారం తల్లాడకు విచ్చేసిన జిల్లా అధ్యక్షులు, స్థానిక పార్టీ కార్యాలయంలో నారపోగు ప్రసాద్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, మీడియా అధ్యక్షులుగా ప్రసాద్ ఎంపిక కావడంఅభినందనీయమని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా నిలవాలని సూచించారు. అనంతరం సన్మానానికి ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మీరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు, కల్లూరు టౌన్ ఇంచార్జ్ కోసూరు వెంకటేశ్వర్లు (కేవీ), మాజీ జెడ్పీటీసీ ఎం. ప్రసాద్, వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, తుమ్మలపల్లి రమేష్, దాసరి శ్రీనివాసరావు తదితర మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

### మంచి ప్రవర్తనతో శాంతియుత జీవనం సాగించాలని సూచన

**వికారాబాద్, :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలోని




వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దేముల్, మర్పల్లి, నవాబుపేట్, బంట్వారం, దౌల్తాబాద్, కుల్కచర్ల, కోటేపల్లి, తాండూర్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లను ఆయా పోలీస్ స్టేషన్లకు పిలిపించి, వారి ప్రవర్తన, గత కార్యకలాపాలను సమీక్షించారు. భవిష్యత్తులో మంచి ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు అక్రమ, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని స్పష్టంగా సూచించారు. కౌన్సెలింగ్ ద్వారా భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతమైన జీవితం గడపాలని వారికి అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

# అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ స్కాలర్షిప్ దరఖాస్తులు



**:కాగజ్నగర్:** కాగజ్ నగర్ పట్టణంలోని పలు డిగ్రీ కాలేజీలలో విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ స్కాలర్షిప్ కోసం దరఖాస్తులు చేయించారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ, తిరుమల, గీత, అంజలి పాల్గొని విద్యార్థినులకు స్కాలర్షిప్ దరఖాస్తు ప్రక్రియలో సహకరించారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవాలని కోరారు.

## హైదర్‌నగర్ భూములను 22-A నిషేధిత జాబితా నుంచి తొలగించండి

**జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్ డిమాండ్**



**కూకట్‌పల్లి, :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్లు 145 (90 ఎకరాలు), 163 (14.26 ఎకరాలు)లలో ఉన్న వసంత్‌నగర్, ఎన్.ఆర్.ఎస్.ఏ తదితర కాలనీలను నిషేధిత ఆస్తుల జాబితా (22-A) నుండి వెంటనే తొలగించాలని కూకట్‌పల్లి జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఈ సందర్భంగా ఆయన పేర్కొన్న ముఖ్యాంశాలు**

గత అనుమతులు & కోర్టు తీర్పులు: ఈ భూములపై వివాదం ఎప్పుడో పరిష్కారమైందని, న్యాయస్థానాలు ప్రైవేట్ వ్యక్తుల హక్కులను ధ్రువీకరించాయని తెలిపారు. గతంలో ప్రభుత్వం కూడా దీనిని అంగీకరిస్తూ 2004, 2006, 2008లలో మెమోలు, 2005లో మ్యూటేషన్ ఆర్డర్ జారీ చేసిందని గుర్తుచేశారు. చట్టబద్ధమైన లావాదేవీలు: ఈ ప్రాంతానికి 1987, 1989లలో హుడా (HUDA) లేఅవుట్ అనుమతులు, ULC క్రమబద్ధీకరణ, GHMC నుంచి LRS మరియు బిల్డింగ్ పర్మిషన్లు లభించాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఇక్కడ ఎటువంటి ఆటంకం లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రజల ఇబ్బందులు: ఎటువంటి వివాదం లేని ఈ భూములను ఇటీవల భూభారతి/ధరణి పోర్టల్‌లో 22-A జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు, నిర్మాణ అనుమతులు నిలిచిపోయి స్థానిక ప్రజలు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సర్వే నంబర్లను నిషేధిత జాబితా నుండి తొలగించాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన జనసేన పార్టీ తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## పాములవాడ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



**: జైనూర్:** రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిర్పూర్(యు) మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాముల వాడలో రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరస్పరం రాఖీలు కట్టి రక్షాబంధన్ పండుగ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రేమ, సోదరభావం, ఐక్యత వంటి విలువలు పెంపొందించాయని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విద్యార్థులు ఆనందోత్సాహాలతో రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు.

## ప్రభుత్వ దృష్టికి జర్నలిస్టుల గళం

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి**

**: సత్తుపల్లి:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలనే డిమాండ్తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం వేంసూర్కు చేరుకుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు వేంసూర్ చేరుకున్న పాదయాత్ర బృందానికి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కెంపు రాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేంసూర్ మండలానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయ సంఘాల ప్రతినిధులు పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యతో పాటు వారి ఇతర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిగణించి పరిష్కరించాలని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అర్హులందరి పేర్లు నమోదయ్యేలా చర్యలు

**: జైనూర్:** ఓటరు జాబితాలో అర్హులందరి పేర్లు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని



సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. జైనూర్ మండలం పవర్గూడ గ్రామపంచాయతీ పరిధిలో ఓటరు జాబితా సవరణపై గురువారం బీఎల్ఏ, బీఎల్ఓలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ఓటర్ల వివరాలను పరిశీలించి, జాబితాలో పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేసే విధానంపై చర్చించారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్ల పేర్లను జాబితాలో నమోదు చేయడం, అర్హత కలిగిన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సూచనలు చేశారు. ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా సవరణలు అవసరమైతే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని కోరారు. జాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జాబితా సవరణలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, బీఎల్ఏలు, బీఎల్ఓలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా ఎస్పీని కలిసిన పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి రమేష్ కుమార్



**వికారాబాద్, :** ఇటీవల నిర్వహించిన వికారాబాద్ జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన పరిగి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి. రమేశ్ కుమార్ (హెచ్ సి -9238) గురువారం వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా నూతనంగా ఎన్నికైన పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రమేశ్ కుమార్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పోలీస్ అసోసియేషన్ బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బందిలో ఐక్యత, సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేలా ప్రోత్సహించాలని అన్నారు. పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు సిబ్బందికి, పోలీస్ శాఖకు మధ్య సమన్వయ వారధిగా పనిచేయాలని, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచే విధంగా క్రమశిక్షణతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బి. రమేశ్ కుమార్ జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

**వికారాబాద్ జిల్లా పోలీస్ అసోసియేషన్**
**నూతన కార్యవర్గం:**

1.అధ్యక్షుడు: బి. రమేశ్ కుమార్, హెచ్ సి -9238, పరిగి పి ఎస్
2.ఉపాధ్యక్షుడు పి. నాగార్జున ఇన్‌స్పెక్టర్ డి ఎస్ బి వికారాబాద్
3.ఉపాధ్యక్షుడు కె. గిరన్న, ఎస్ ఐ పి నవాబుపేట్ పి ఎస్
4.జనరల్ సెక్రటరీ పి. విట్టల్ రెడ్డి ఎస్ ఐ పి యాలాల పి ఎస్
5.జాయింట్ సెక్రటరీ జి. శ్రీనివాస్ హెచ్ సి -843 కరన్‌కోట పి ఎస్
6.ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. వేణుగోపాల్ హెచ్ సి -1085 డి సి ఆర్ బి వికారాబాద్
7.ట్రెజరర్: టి. నాగేష్, పి సి -5566, చెంగోముల్ పి ఎస్

యూనిట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు – 6

8. కె. మహేశ్వర్ రెడ్డి పి సి -5610, యాలాల పి ఎస్
9. ఎం. శ్రీనివాస్ గౌడ్, పి సి -6165, యాలాల పి ఎస్
10. వై. పండయ్య, హెచ్ సి -2864 డి టి సి వికారాబాద్
11. కె. మీనా దబ్బ్యూ పిసి -10374 డి ఎస్ బి వికారాబాద్
12. ఎం.డి. అయూబ్, ఏ ఆర్ హెచ్ సి -4575 డి ఏ ఆర్ వికారాబాద్
13. జి. రాఘవేందర్, ఏ ఆర్ పి సి -6646 డి ఏ ఆర్ వికారాబాద్

యూనిట్ కో-ఆప్షన్ మెంబర్లు – 2

14. చి. నర్సిములు, హెచ్ సి -2769, బొంరాస్‌పేట్ పి ఎస్
15. బి. వెంకటేష్, పి సి -5885, కుల్కచర్ల పి ఎస్

ఈ కార్యక్రమం జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేశ్ మీనా, పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘ భవనంలో లైబ్రరీ ప్రారంభం

**: ఆదిలాబాద్:** పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడని, మంచి పుస్తకం మంచి భవిష్యత్తును అందిస్తుందని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష అన్నారు. పట్టణంలోని తాలూకా మున్నూరుకాపు సంఘ భవన ఆవరణలో యువత కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీని గురువారం ఆమె మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో జ్ఞానంతో పాటు మంచి వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. ఆర్థిక భారంతో ప్రత్యేక శిక్షణ పొందలేని పేద విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చదువు విలువ తెలిసి, విశ్రాంత ఉపాధ్యాయుడైన తాలూకా అధ్యక్షుడు శివన్న నేతృత్వంలో ఈ లైబ్రరీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం



అధ్యక్షుడు తోట శివన్న, కార్యదర్శి సంతోష్, రఘుపతి, బండారి సతీష్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**: మంచిర్యాల:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత




ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం వంటశాల, భోజనశాలలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి విద్యాలయంలో అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

- మాదకద్రవ్య రహిత మంచిర్యాలే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**: మంచిర్యాల:** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ఞతో కలిసి డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత మంచిర్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 49 డ్రగ్స్ కేసులు నమోదు కాగా, 103 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతినెలా అవగాహన కార్యక్రమాలు, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెడికల్, ఐటీఐ, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక నిఘా ఉంచి డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి తదితర మొక్కల సాగును గుర్తించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. మెడికల్ షాపులను నిరంతరం తనిఖీ చేసి సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ ఇన్స్పెక్టర్కు సూచించారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేయడంతో పాటు బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు..

జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించిన కలెక్టర్ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రోడ్డు భద్రత సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై చెత్త, ఇతర ఆటంకాలను తొలగించాలని, అనధికార పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్సైడ్ డ్రైవింగ్పై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 95 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసినట్లు తెలిపారు. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై సంచరించే పశువులను గోశాలలకు తరలించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# హాస్యం పండించడంలో సాటి లేని మేటి భమిడిపాటి

## నేడు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు వర్ధంతి

హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చమ్మ దంపతుల కు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి .....వాటిల్లో కొన్ని తీసుకుంటే.. మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్సీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి...పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి... జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజా; ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉన్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాఖీ.. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి పండుగ

- శ్రావణ పౌర్ణమికి ఎన్నో విశిష్టతలు
- జంధ్యాల పౌర్ణమి.. నారికేళ పూర్ణిమగానూ ప్రాచుర్యం
- ఉపాకర్మతో వేదాధ్యయనానికి శ్రీకారం
- సోదరుడి క్షేమం కోరుతూ సోదరి కట్టే రక్షాబంధనం
- పురాణ కాలం నుంచి కొనసాగుతున్న పవిత్ర సంప్రదాయం



శ్రావణ పౌర్ణమి అంటే కేవలం రాఖీ పండుగ మాత్రమే కాదు. ఆధ్యాత్మికత, కుటుంబ అనుబంధాలు, వేద సంప్రదాయాలు మేళవించిన విశిష్ట పర్వదినం. హయగ్రీవ జయంతిగా, జంధ్యాల పౌర్ణమిగా, రాఖీ పౌర్ణమిగా, నారికేళ పూర్ణిమగా వివిధ ప్రాంతాల్లో ఈ పర్వదినం ప్రసిద్ధి చెందింది. ప్రాంతాన్ని బట్టి ఆచారాలు మారినా.. రక్షణ, శ్రేయస్సు, అనుబంధం అనే భావనలే ఈ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తాయి. వర్షాకాలం రాకను స్వాగతిస్తూ మధుర పదార్థాలను స్వీకరించడం కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం. వరుణ దేవుడి అనుగ్రహం కోసం కొబ్బరికాయలను సమర్పించే ఆచారం కారణంగా దీనికి 'నారికేళ పూర్ణిమ' అనే పేరు వచ్చింది. ముంబయి సహా పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ రోజున సముద్రాన్ని పూజించి వరుణ దేవుడి కరుణ కోరడం ఆనవాయితీ. పూర్వకాలంలో సముద్రయానాలు, వర్తక కార్యకలాపాలకు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది.

### జంధ్యాల పౌర్ణమిగా ప్రత్యేకత

శ్రావణ పౌర్ణమికి వేద సంప్రదాయంలోనూ విశిష్ట స్థానం ఉంది. పూర్వకాలంలో ఉపాకర్మ అనంతరం వేదాధ్యయనాన్ని ప్రారంభించేవారు. ఉపాకర్మ అనేది కేవలం పండుగ కాకుండా వేదాధ్యయనానికి



సంబంధించిన ముఖ్యమైన వైదిక కర్మగా భావిస్తారు. యజ్ఞోపవీతంలోని మూడు పోచలకు ఆధ్యాత్మికంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలైన త్రిమూర్తులను అవి సూచిస్తాయని సంప్రదాయ విశ్వాసం. జంధ్యాల పౌర్ణమి రోజున యజ్ఞోపవీతాన్ని మార్చుకొని వైదిక కర్మలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఋషులను స్మరించుకుంటూ ఋషి పూజలు, ఋషి తర్పణాలు నిర్వహిస్తారు. గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి మహర్షులను సప్తర్షులుగా పేర్కొనే సంప్రదాయం ఉంది. ఇతర పురాణ గ్రంథాల్లో సప్తర్షుల జాబితాలో భిన్నమైన పేర్లు కూడా కనిపిస్తాయి. యజుర్వేద సంప్రదాయంలో పౌర్ణమి తిథికి, రుగ్వేద సంప్రదాయంలో శ్రవణ నక్షత్రానికి, సామవేద సంప్రదాయంలో హస్త నక్షత్రానికి ఉపాకర్మలో ప్రాధాన్యం ఉన్నట్లు వైదిక సంప్రదాయాలు పేర్కొంటాయి.

### రాఖీ.. ఓ దారమే కాదు

శ్రావణ పౌర్ణమికి ప్రజల్లో అత్యంత ప్రాచుర్యం తెచ్చింది రక్షాబంధనం. సోదరి తన సోదరుడి ముంజేతికి రాఖీ కట్టి అతడి ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కోరుతుంది. సోదరుడు తన సోదరికి జీవితాంతం అండగా ఉంటాననే భావనను వ్యక్తం చేస్తాడు. అందుకే రాఖీ కేవలం రంగురంగుల దారం కాదు.. సోదరీసోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తోంది. రాఖీని పట్టు లేదా నూలు దారాలతో తయారు చేయడం పూర్వపు సంప్రదాయం. కాలక్రమంలో అది రంగురంగుల అలంకరణలతో ఆభరణాన్ని తలపించేలా మారింది. సోదరుడికి బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, రాఖీ కట్టడం.. అనంతరం సోదరుడు సోదరికి కానుక అందించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

### పురాణాల్లోనూ రక్షాబంధనం

రక్షాబంధనానికి సంబంధించి పురాణాల్లో పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ధర్మరాజు శ్రీకృష్ణుడిని రక్షణకు మార్గం అడిగినప్పుడు రక్షాబంధన విధిని వివరించినట్లు ఒక కథనం చెబుతుంది. దేవాసుర సంగ్రామ సమయంలో ఇంద్రాణి ఇంద్రుడికి రక్షను కట్టి విజయాన్ని ఆకాంక్షించిన కథ కూడా రక్షాబంధన ప్రాశస్త్యంతో ముడిపడి ఉంది. కాలక్రమంలో రక్షాబంధనం సోదరీసోదరుల అనుబంధానికి ప్రధాన చిహ్నంగా మారింది. రక్తసంబంధం లేకపోయినా ఒక మహిళ పురుషుడికి రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేసే సంప్రదాయం కూడా ఏర్పడింది. రాఖీ స్వీకరించిన వ్యక్తి ఆమెకు అండగా, రక్షకుడిగా ఉండాలన్న భావన దీనిలో కనిపిస్తుంది.

### అనుబంధాలకు అక్షయ తోరణం

కాలం మారింది.. జీవన విధానాలు మారాయి.. కుటుంబాలు ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలకు విస్తరించాయి. కానీ రాఖీ కట్టే చేతిలోని ఆప్యాయత మాత్రం మారలేదు. చిన్న తోరంతో మొదలయ్యే ఈ వేడుక సోదరీసోదరుల మధ్య జీవితకాల అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. అందుకే రాఖీ అంటే చేతికి కట్టే దారం మాత్రమే కాదు.. 'నీకు నేనున్నా' అని ఇచ్చే భరోసా. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి చిరునామా.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు

"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు. గుఱ్ఱపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్ళుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు, ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుర్రం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్థనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి, నిలబడే నిద్ర పోయారు. విష్ణువును వెదకుతూ



వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్థించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుర్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్డుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారు బ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవ నామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి.హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది.ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం

- శ్రీలంక ఆటగాడు సోనాల్ దినుషా అజేయ శతకం
- శ్రీలంకతో డ్రాగా ముగిసిన రెండో టెస్ట్
- టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం
- శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య



ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో



55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు. తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిభిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది.ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.




# రవీంద్ర జడేజా చెత్త రికార్డ్..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ కాలంలో అత్యధిక నోబాల్స్ వేసిన ఆటగాడిగా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో జడేజా 88 నోబాల్స్ వేసాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో జడేజా మొత్తం నాలుగు నోబాల్స్ వేసాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో ఒకటి వేసాడు. తొలి టెస్ట్‌లోనూ జడేజా నాలుగునో బాల్స్ వేసాడు. ఇన్నింగ్స్‌కు రెండు చొప్పున నోబాల్స్ సంధించాడు. ఇందులో ఒకటి ధనంజయ డి సిల్వాకు లైఫ్‌లైన్‌గా మారింది. దాంతో టెస్టు క్రికెట్‌లో ఒక స్పిన్నర్ అత్యధిక నో బాల్స్ వేసిన చెత్త రికార్డును జడేజా మూటగట్టుకున్నాడు. జడేజా తర్వాత రెండో స్థానంలో పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ ఉన్నాడు.రెండో టెస్ట్‌లో జడేజాతో సహా భారత బౌలర్లంతా 10 నోబాల్స్ వేసారు. అఫ్గానిస్థాన్(14) తర్వాత అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా భారత జట్టు అప్రతిష్టను మూటగట్టుకుంది.ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు.తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది.

# కొత్త గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా డ్రీమ్11

డ్రీమ్11 కొత్త దారిలోకి అడుగుపెట్టింది. రియల్ మనీ గేమింగ్, నగదు బహుమతులతో కూడిన ఫాంటసీ స్పోర్ట్స్ కాంటెస్టులను ఆపేసిన ఏడాది తర్వాత, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను కలిపే ప్లాట్‌ఫామ్‌గా మారిందని పీటీఐ వెల్లడించింది. ఇకపై డ్రీమ్11లో ప్రైజ్ మనీ ఉండదు. స్పోర్ట్స్ కంటెంట్, లైవ్ స్ట్రీమింగ్, స్కోర్లు, స్టాట్స్, కమ్యూనిటీ ఫీచర్లు, స్పోర్ట్స్ అనుభవాలు, సోషల్ కాంటెస్టులపై సంస్థ దృష్టి పెట్టనుంది. గురువారం డ్రీమ్11 ఈ మార్పును ప్రకటించింది. ఇంతకాలం ఫాంటసీ స్పోర్ట్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన ప్లాట్‌ఫామ్, ఇప్పుడు గ్లోబల్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా మారింది.

కొత్త ప్లాట్‌ఫామ్‌లో ఏఐకి ప్రధాన పాత్ర ఉండనుంది. యూజర్లు ఇష్టపడే స్పోర్ట్స్, లీగ్‌లు, టీమ్‌లు, ప్లేయర్ల ఆధారంగా వారికి నచ్చే కంటెంట్, అనుభవాలను వ్యక్తిగతంగా అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను ఒక కమ్యూనిటీగా కలపడం ద్వారా 'మేక్ స్పోర్ట్స్ బెటర్' అనే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని డ్రీమ్11 చెబుతోంది. కొత్త డ్రీమ్11లో ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు రకాల స్పోర్ట్స్ అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నారు. యూజర్లు లైవ్ మ్యాచ్‌లు చూడొచ్చు. గత వారాంతంలో జరిగిన రేస్‌ను ఫాలో అవ్వొచ్చు. స్టాటిస్టిక్స్, కామెంటరీ చూడొచ్చు. స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రత్యేక అనుభవాలను బుక్ చేసుకోవచ్చు. స్నేహితులు, ఇతర స్పోర్ట్స్ అభిమానులతో కలిసి సోషల్ కాంటెస్టుల్లో పాల్గొనొచ్చు.డ్రీమ్11 సీఈఓ




వైభవ్ కోకల్ మాట్లాడుతూ, తమ 30 కోట్ల మంది యూజర్లతో పనిచేసిన అనుభవం ద్వారా స్పోర్ట్స్ అభిమానులు కేవలం ఆటను మాత్రమే కోరుకోవడం లేదని చెప్పారు. వాళ్లు ఒక కమ్యూనిటీలో భాగంగా ఉండాలని కూడా కోరుకుంటున్నారని తెలిపారు. "దేశంలోని అత్యుత్తమ టెక్ టాలెంట్ మద్దతుతో, ఇండియాలో తయారై ప్రపంచం కోసం రూపొందించిన ఏఐ-ఫస్ట్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని ఆయన చెప్పారు. గత ఏడాది ఆగస్టులో పార్లమెంట్ 'ప్రొమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025'ను ఆమోదించిన తర్వాత డ్రీమ్11 తన రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత ప్లాట్‌ఫామ్‌లో డబ్బులు చెల్లించి ఆడే కాంటెస్టులన్నింటినీ ఆపేసింది. కొత్త చట్టానికి అనుగుణంగా ఉచితంగా ఆడే సోషల్ గేమింగ్ మోడల్‌కు మారింది. మొత్తంగా చూస్తే, డ్రీమ్11 ఇకపై డబ్బులు గెలుచుకునే ఫాంటసీ స్పోర్ట్స్ యాప్‌గా కాకుండా, లైవ్ స్పోర్ట్స్, కంటెంట్, స్టాట్స్, కమ్యూనిటీ, సోషల్ కాంటెస్టులు, స్పోర్ట్స్ అనుభవాలను ఒకే చోట అందించే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా తన కొత్త ప్రయాణాన్ని కొనసాగించనుంది.

# అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది.భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.




# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా



వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.




# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది. 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

## రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం




టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ~~ఈ~~ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ~~ఈ~~ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ~~ఈ~~ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ~~ఈ~~సారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ~~ఈ~~ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ~~ఈ~~ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ~~ఈ~~ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ~~ఈ~~ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ~~ఈ~~ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ~~ఈ~~ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.

# సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది

## ఇరుడుముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు






ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్థమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com